# విపశ్యన మాసపత్రిక

VOLUME : 2 NO - 1 1 APRIL, 2007

(సాధకుల ప్రేరణ కొరకు ఉద్దేశించబడిన తెలుగుమాస పత్రిక)

విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం, ధమ్మఖేత్, వనస్థలిపురం, హైదరాబాదు – 70


## "ధర్మవాణి"

| | |
|---|---|
| దానఞ్చ ధమ్మచరియా చ<br>ఞాతకానఞ్చ సఙ్గహో<br>అనవజ్జాని కమ్మాని<br>ఏతం మఙ్గల ముత్తమం<br>– మఙ్గలసుత్తం | దానం చేయడం, ధర్మాన్ని ఆచరించడం, బంధు మిత్రులకు సహాయం చెయ్యడం, నిందారహిత కర్మలను చేయడం ఇదే ఉత్తమము, మంగళకరము. |

(గత సంచిక తరువాయి)

## గృహస్థుల ఆచార సంహిత

(పూజ్యగురూజీ వ్రాసిన "మంగల్ జగే గృహీ జీవన్‌మే" హిందీ పుస్తకమునకు తెలుగు అనువాదం "మంగళమయ గృహస్థ జీవితం" నుండి)

**నమస్కారము ఎవరికి చేయాలి ?**

మగధదేశపు రాజధాని "రాజగృహ"లో శ్రేష్ఠీపుత్ర సిగాలుడు తెల్లవారుజామున లేచి నగరము దాటి వెళ్ళి తడిసిన వస్త్రాలతో, తడారని తలతో తూర్పు, దక్షిణం, పడమర, ఉత్తరం, పైన ఇంకా క్రింద ఆరు దిక్కులకు చేతులు జోడించి ప్రణామాలు చేస్తున్నాడు. ఆ రోజుల్లోని పూజా విధానాల్లోనో లేక కర్మకాండల్లోనో ఇది ఒకటై ఉంటుంది. అదే సమయాన భగవానుడు వేణువనవిహారంనుండి రాజగృహం వైపు భిక్షాటనకై బయలుదేరాడు. దారిలో శ్రేష్ఠీపుత్ర సిగాలుడు ఆరు దిక్కులకు ప్రణామాలు చేస్తుండడం గమనించి,

**భగవానుడు** : గృహపతి–పుత్రా నీవు చేస్తున్న ఈ పని ఏమిటి ?

**సిగాలుడు** : భగవాన్! దిక్కులకు నమస్కరిస్తున్నాను. నా తండ్రి మరణిస్తూ నన్ను దిక్కులకు నమస్కారాలు చేయమని ఆదేశించారు. అందువల్ల నా తండ్రి అంతిమ ఆదేశాల పాలనం చేస్తున్నాను" జవాబిచ్చాడు, అపుడు.

**భగవానుడు** : "గృహపతి–పుత్రా! ఆర్య ధర్మంలో ఇలా ఆరు దిక్కులకు నమస్కారాలు చేయడమనేది లేదు."

**సిగాలుడు** : మంచిది, భగవాన్ ! మీరు కృపతో నాకు ఆర్య ధర్మజ్ఞానాన్ని ప్రసాదించండి." అని అడిగాడు.

అప్పుడు శ్రేష్ఠీ పుత్ర సిగాలుని ప్రార్థన మన్నించి, ఆ సమయాన భగవానుడిచ్చిన ఉపదేశం సిగాలునికేగాక గృహస్థులందరికీ అత్యంత కల్యాణకారి అయినటువంటిది. గృహస్థులకై ఉద్దేశించిన ఈ ఆచార–సంహిత శుద్ధధర్మంవలె సార్వజనీనమైనది, సార్వదేశికమైనది, సార్వకాలికమైనది. ఆనాడు, 2600 సం॥ పూర్వం సిగాలునికి ఇచ్చిన ఈ ఉపదేశము ఎంత శ్రేష్ఠమైనదో ఈనాటి గృహస్థునికి గూడా అంతే శ్రేష్ఠమైనది.

రండి! భగవానుని ఈ మంగళకరమైన ఉపదేశాన్ని అర్థం చేసుకొందాం.

భగవానుడు – గృహపతి పుత్రా! గృహస్థుడైన ఆర్యుడు నాలుగు కర్మ–క్లేశాల నుండి దూరంగా ఉంటాడు. నాలుగురకాల దూషిత చేతనలు ఆధారంగా గల పాపకర్మలను వదిలివేస్తాడు. ఆరురకాల వినాశకారులగు ఆచరణలనుండి తప్పించుకొంటాడు. ఈ ప్రకారంగా 14 రకాల ఇంద్రియనిగ్రహంగల జీవితం జీవిస్తూ ఆరు దిక్కులా కవచాన్నేర్పరచుకొని సురక్షితంగా ఉంటాడు. తన ఇహలోకాన్ని మరియు పరలోకాన్ని సంస్కరించుకొంటాడు. ఈ జీవితాన్ని సఫలం, సార్థకం చేసుకొంటాడు. శరీరంవదిలినప్పుడు అతనికి సుగతి ప్రాప్తిస్తుంది.

"హత్య, దొంగతనం, వ్యభిచారం మరియు అసత్య భాషణం – ఈ నాలుగూ కర్మ–క్లేశాలు, మలినకర్మలు. ఈ కర్మలవల్ల క్లేశమే పెరుగుతుంది.

ఈ నాలుగూ మాటలతోనూ, చేతలతోనూ చేసే దుష్కర్మలు. వీటివల్ల అతడు ఇతర ప్రాణుల సుఖాన్ని హరించివేస్తాడు. వారి దుఃఖానికి కారణమవుతాడు. తనకు కూడా దుఃఖమే లభిస్తుంది.

ఈ నాల్గింటి నుండి విరక్తుడై, సాధనద్వారా సద్గృహస్థుడు తనచిత్తాన్ని వశపరచుకోవడమే గాక నిర్మలం చేసుకొంటాడు. దానిని వికారవిహీనం చేస్తాడు. రాగ, ద్వేష, మోహ మరియు భయములనే ఈ నాలుగు దూషిత మనో చేతనల ఆధారంగా ఏ పాపకార్యములనూ తలపెట్టడు.

ఈ ఎనిమిది రకాల దోషాలపై విరక్తిగల సద్గృహస్థుడు తెలివితో తన సంపాదనను సంరక్షించుకొంటాడు. ధనసంపదను నష్టపరిచే ఆరు కారణాలనుండి దూరంగా ఉంటాడు. ధన వినాశ హేతువులయిన ఆరు కారణాలేవనగా 1. మద్యపానం, 2. తిరుగ కూడని సమయాల్లో, సందుల్లో – గొందుల్లో షికార్లు చేయడం ,3. నృత్య గానాలు, తమాషాలలో ఆసక్తి 4. జూదమాడడం, 5. పాపులతో సాంగత్యం చేయడం 6. సోమరితనం.

వివేకవంతుడైన గృహస్థుడు ఈ దురలవాట్లన్నీ ధనవినాశనం మరియు స్వపతనానికి కారణాలని గ్రహిస్తాడు.

**ధనవినాశనానికి గల ఆరు కారణాలు : వాటి పరిణామాలు :**

**1. మద్యపాన వ్యసన పరిణామాలు**

అ) కళ్ళముందే చూస్తూ చూస్తూనే సంపదలు నశించిపోతాయి.

ఆ) కలహాలు తగువులు పెరుగుతాయి.

ఇ) నానారకాలైన వ్యాధులకు తలుపులు తెరుచుకొంటాయి.

ఈ) అపకీర్తి పాలవుతాడు.

ఉ) సిగ్గు పోతుంది.

ఊ) బుద్ధిహీనుడవుతాడు.

**2. తిరుగ కూడని సమయాల్లో సందుల్లో, గొందుల్లో షికార్ల వల్ల వచ్చే పరిణామాలు**

అ) తను అసురక్షితుడవుతాడు.

ఆ) ఇంటివద్ద భార్యా–బిడ్డలు అసురక్షితులవుతారు.

ఇ) ధనం, సంపద అసురక్షితమవుతుంది.

ఈ)ఎవరో చేసిన పాపానికి తనను అనుమానిస్తారు.

ఉ) అబద్ధపునిందలు వేస్తారు.

ఊ)వాస్తవంగా అనేక దుఃఖాలకు కారణమైన దుష్కర్మలుగూడా జరుగుతాయి.

**3. నృత్య–గానాలు, తమాషాల వ్యసనాల వల్ల వచ్చే పరిణామాలు**

ఇవ్వాళ ఎక్కడ పాటకచ్చేరీ ఉంది, నృత్యగానం ఉంది, వాద్య సంగీతకచేరీలున్నాయి, హరికథలున్నాయి, తాళ మృదంగ వాద్య కచేరీ ఉంది అనే ఆలోచనలతో ఎల్లప్పుడూ వ్యాకులత చెందుతూ, ఉద్వేగానికి లోనవుతూ ఉంటాడు. నిత్యమూ పాట కచేరీలు, నృత్యగానాలు, సినిమాలు, డ్రామాలు, ఆటలు – తమాషాలు, నైట్ క్లబ్ లలో తిరిగే వ్యసనాలు ధనం, చరిత్ర మరియు ఆరోగ్యం మూడింటినీ నాశనం చేస్తాయి.

**4. జూదం వల్ల వచ్చే పరిణామాలు**

అ) గెలిస్తే వైరం కొని తెచ్చుకొంటాడు.

ఆ) ఓడితే డబ్బు పోయిందనే దుఃఖాన్ని కొని తెచ్చుకొంటాడు.

ఇ) చూస్తుండగానే కళ్ళెదుటే డబ్బు హరించుకు పోతుంది.

ఈ) సమాజంలో అతని మాటను ఎవరూ విశ్వశించరు.

ఉ) మంచి మిత్రులు, సహయోగులు తిరస్కరిస్తారు.

ఊ) 'వీడు పెళ్ళాం పిల్లల్ని పోషించలేడు', అని ఎవరూ పిల్లనివ్వరు.

**5. పాపులతో స్నేహం వల్ల పరిణామాలు :**

ఏ మంచి వ్యక్తీ ఇతనికి తోడుగా ఉండడు. కేవలం దుష్టులు, వ్యభిచారులు, కాముకులు, పాఖండులు, గూండాలు, ద్రోహులు మాత్రమే అతని సాంగత్యం చేస్తారు.

దుర్జనుల సాంగత్యం, సజ్జనుల అసాంగత్యం వల్ల, తను కూడబెట్టుకున్న సంపద నంతా పోగొట్టుకొని నానారకాల దుఃఖాలు కొని తెచ్చుకొంటాడు.

**6. సోమరితనానికి బానిస అవడానికి కారణాలు :**

అ) చాలా చలిగా వుంది.

ఆ) చాలా వేడిగా వుంది.

ఇ) చాలా ఆలస్యమైంది.

ఈ) ఇంకా తెల్లవారలేదు.

ఉ) చాలా ఆకలిగా వుంది.

ఊ) ఎక్కువగా తినేశాను.

అని ఇలాంటి వంకలు వెతికి, చేయవలసిన పని చెయ్యడు. ఫలితంగా తనకు రావలసిన సంపదను పొందలేడు. ఉన్నదాన్ని పోగొట్టుకుంటాడు.

## నిజమైన మిత్రుని గుర్తు

సంపత్తిని నాశనంచేసే పై ఆరు కారణాలలోనూ, పాపులతో చేయు దుస్సాంగత్యానికి భగవానుడు ఎక్కువ మహత్వమిచ్చాడు. తరచుగా సత్సాంగత్యం దొరకని కారణాన మరియు దుస్సాంగత్యంలో పడడంవల్ల గృహ-పుత్రులు నానావిధాలైన దుఃఖదాయకమైన వ్యసనాలకు బానిసలవుతుంటారు. అందువల్ల మిత్రుని రూపంలో శత్రువెవరో గుర్తించడం చాలా అవసరం. భగవానుడు ఇలా తెలిపాడు :

"గృహపతిపుత్రా ఈ నలుగురిని మిత్రుల రూపంలో ఉన్న శత్రువులని గ్రహించాలి"

**1. పరధన హారక మిత్రుడు :** ఇలాంటి వ్యక్తి -

అ) పరుల ధనాన్ని అపహరించే ఉద్దేశంతో మితృత్వం కలుపుతాడు.

ఆ) కొద్దిగా ఇచ్చి చాలా రాబట్టాలని చూస్తాడు.

ఇ) నానారకాల ఇబ్బందులు వచ్చే పనులు చేస్తాడు.

ఈ) తన స్వార్థం కోసం కలిసి ఉంటాడు.

**2. వదరుబోతు మిత్రుడు (వాగేవాడు) :** ఇలాంటి వ్యక్తి ఎందుకూ పనికిరాడు. మాటలు మాత్రం చెబుతుంటాడు.

అ) ఒకప్పుడు నీకు సహాయం చెయ్యాలని ప్రాకులాడానని అబద్ధాలు చెబుతాడు.

ఆ) ఎప్పుడైనా అవసరం వస్తే ఈ విధంగా సహాయపడతానని గోరంతలు కొండంతలుగా చేసి చెబుతుంటాడు.

ఇ) వర్తమానానికి సంబంధించి గాలి మేడలు కడుతుంటాడు.

ఈ) కానీ నిజంగా అవసరం వచ్చినప్పుడు మొఖం చాటేస్తాడు.

**3. పొగిడేమిత్రుడు :** ఇలాంటి వ్యక్తి -

అ) చెడ్డపనుల్లో గూడా సై అంటే సై అంటాడు.

ఆ) మంచి పనుల్లోనూ సరేనంటే సరే అంటాడు.

ఇ) నీ ముందు ప్రశంసలు.

ఈ) నీ వెనుక నిందాలాపనలు.

**4. వినాశ-సహాయక మిత్రుడు :** ఇలాంటి వ్యక్తి -

అ) మద్యపాన వ్యసనంలో చిక్కుకోడానికి తోడ్పడుతాడు.

ఆ) తిరుగ కూడని సమయాల్లో సందుల్లో, గొందుల్లో పనిలేకుండా తిరగడంలో తోడుంటాడు.

ఇ) ఆట-పాటల్లో , నృత్యగానాల్లో మునిగి తేలడంలో తోడుంటాడు.

ఈ) ప్రమాదకారి అయిన జూదంలో తోడుంటాడు.

భగవానుడు "పై నాలుగు విధాల వ్యక్తులను 'మిత్రుని వేషంలో ఉన్న శత్రువు', అని గ్రహించి వారి సాంగత్యం శీఘ్రాతిశీఘ్రంగా వదిలించుకోడంలో నీ మంచి ఉంది" అంటారు.

ఈ విధంగానే ఈ క్రింది నాలుగు రకాల నిజమైన మిత్రులను తన హితులుగా భావించి వారి సాంగత్యంతో లాభం పొందమన్నాడు.

**1. ఉపకారియైన మిత్రుడు - ఈ వ్యక్తి-**

అ) మత్తులోవున్న మిత్రుడిని ఆపదల నుండి కాపాడుతాడు.

ఆ) మత్తులోవున్న మిత్రుని సంపద కాపాడుతాడు.

ఇ) కష్టాలొచ్చిన మిత్రునికి శరణుయిస్తాడు.

ఈ) పనిపడ్డప్పుడు అవసరానికంటే రెండు రెట్లు మిత్రునికి చేస్తాడు.

**2. సమాన సుఖదుఃఖ మిత్రుడు -** సుఖదుఃఖాలలో రెండింటియందూ తోడుండేవాడు.

అ) తన రహస్యాలను మిత్రునికి చెబుతాడు.

ఆ) మిత్రుని రహస్యాలను ఇతరులవద్ద దాస్తాడు.

ఇ) కష్టాలలో మిత్రుని వదిలి పెట్టడు.

ఈ) అవసరం వచ్చినప్పుడు మిత్రునికై ప్రాణాలైనా ఇవ్వడానికి వెనుకాడడు.

**3. శ్రేయోభిలాషి మిత్రుడు -** మంచి చెడులను విశ్లేషించు ఈ వ్యక్తి

అ) మిత్రుడిని పాపాలబారినుండి రక్షిస్తాడు.

ఆ) మిత్రుడిని పుణ్యకార్యాలలో పడేస్తాడు.

ఇ) మిత్రునికి అతడు వినని ధర్మం గురించి చెబుతాడు.

ఈ) మిత్రునికి సద్గతి ప్రాప్తించు మార్గాన్ని బోధిస్తాడు.

**4. అనుకంపక మిత్రుడు -** సానుభూతి చూపించే ఈ వ్యక్తి,

అ) మిత్రుడు నిర్ధనుడైనపుడు సంతోషించడు.

ఆ) మిత్రుడు ధనికుడైనపుడు సంతోషిస్తాడు.

ఇ) మిత్రుని నిందించువానిని ఆపుతాడు.

ఈ) మిత్రుని ప్రశంసించు వానిని ప్రోత్సహిస్తాడు.

పై నాలుగు రకాల చెడు స్నేహాలు వదలి, నాలుగు రకాల మంచి స్నేహాలు చేయు గృహస్థుడు విపత్తులనుండి తప్పించుకుంటాడు. సంపత్తి సంపన్నుడవుతాడు.

### వాస్తవమైన ఆరు దిశలు

ఆ తరువాత భగవానుడు శ్రేష్ఠీ పుత్ర సిగాలునకు ఆర్య ధర్మంలో నిజమైన ఆరు దిశల పూజకు అర్థం చెప్పి నేర్పించారు. ఆరు దిశలను ధర్మపు వస్త్రంతో ఎలా కప్పాలో, ధర్మ పూర్వక జీవితం జీవించి అన్ని దిశలలోను తన సురక్షణ కవచాన్ని ఎలా సుసిర్థం చేసుకోవాలో తెలియజెప్పాడు.

ఆరు దిశలు అనగానేమి ?

**తల్లిదండ్రులకు తూర్పుదిశ, గురుజనులకు దక్షిణదిశ, భార్యాబిడ్డలకు పశ్చిమదిశ, బంధుమిత్రులకు ఉత్తరదిశ, పాలేరు పనివాళ్ళకు క్రిందిదిశ మరియు శ్రమణ బ్రాహ్మణులకు పై దిశ** అని తెలుసుకోవాలి.

**1. తల్లి దండ్రుల సేవ.**

పుత్రులు ఐదు విధాలుగా తల్లిదండ్రుల సేవ చేయాల్సి ఉంటుంది.

క) వారు నన్ను పోషించి పెద్ద చేశారు కాబట్టి, నేను వారి వృద్ధాప్యంలో వారి పోషణభారం వహించాలి.

ఖ) వారు నాపట్ల వారి కర్తవ్యం నిర్వహించారు కాబట్టి, నేనూ వారి పట్ల నా కర్తవ్యం నిర్వహించాలి.

గ) వారు వంశం - కులం కాపాడారు కాబట్టి, నేనూ వంశాన్నీ, కులాన్నీ కాపాడాలి.

ఘ) వాళ్ళు నాకు వారసత్వాన్ని ఇచ్చారు కాబట్టి, నేనుగూడా వారసత్వాన్ని ఇవ్వాలి.

ఙ) దివంగతులైన కులపెద్దలు, తాతముత్తాతల పుణ్యార్థం దానం చేయాలి.

ఈవిధంగా ఐదు రకాలుగా సేవించిన **పుత్రులను తల్లితండ్రులు** ఐదు విధాలుగా దీవిస్తారు.

(చ) వారిని పాపకర్మలనుండి కాపాడతారు.

(ఛ) వారిని పుణ్యకర్మలలో పెడతారు.

(జ) వారికి విద్యలు నేర్పిస్తారు.

(ఝ) తగిన వధువును తెచ్చి పెళ్ళి చేస్తారు.

(ఞ) సమయం వచ్చినపుడు తమ వారసునిగా ప్రకటిస్తారు.

పై విధంగా సేవించబడ్డ మాతా పిత రూపమైన తూర్పు దిక్కు ఐదు రకాలుగా పుత్రునిపై కృప చూపుతుంది. ఈ విధంగా గృహస్థునకు తూర్పు దిక్కు శుభప్రదమౌతుంది. కవచమౌతుంది, యోగ క్షేమ పూర్వకమౌతుంది, నిర్భయాన్నిస్తుంది.

## 2. గురుజనుల సేవ

శిష్యుడు ఐదు విధాలుగా గురువుల సేవ చేయాల్సి ఉంటుంది.

(క) తత్పరతతో లేచినిలబడాలి.

(ఖ) అవసరం వచ్చినపుడు దగ్గర ఉండాలి.

(గ) శుశ్రూష చేయాలి.

(ఘ) పరిచర్యలు చేయాలి.

(ఙ) వారినుండి సత్కార పూర్వకమైన విద్య నేర్చుకోవాలి.

ఇలా ఐదువిధాలుగా సేవించబడ్డ **గురువు శిష్యునకు** ఐదువిధాలుగా కరుణ చూపుతాడు.

(చ) వానిని నీతిమంతుణ్ణి చేస్తాడు.

(ఛ) చక్కగా విద్యను గ్రహించే విధానాన్ని నేర్పుతాడు.

(జ) తాము నేర్చిన వృత్తి మరుగునపడకుండా, యోగ్యుని ద్వారా నిలచి ఉండేట్లు అందులోని మెళకువలను విశ్లేషించి నేర్పుతాడు.

(ఝ) అతని బంధువులలో ప్రశంశించి ప్రోత్సహిస్తాడు.

(ఞ) ప్రతి దిశయందు సురక్షితంగా ఉండగలిగే విధంగా వానికి శిక్షణ నిస్తాడు.

ఈ ప్రకారంగా ఐదువిధాలుగా **శిష్యునిచే సేవించబడ్డ దక్షిణదిశ రూపుడైన ఆచార్యుడు,** అతనిపై ఐదు రకాలుగా కృప చూపించి దక్షిణ దిశను శుభకరంగాను, రక్షణకవచంగాను, భయరహితంగాను చేస్తాడు.

## 3. భార్య సేవ

పతి ఐదువిధాలుగా **పత్నికి సేవ** చేయాల్సి ఉంటుంది.

(క) ఆమెను గౌరవంగా చూసుకోవాలి.

(ఖ) ఆమెను అవమాన పరచకూడదు.

(గ) వ్యభిచారం చేయకూడదు.

(ఘ) ఆమెకు సంపదను వినియోగపరిచే అధికారమివ్వాలి.

(ఙ) ఆమెకు అలంకారానికి కావలిసిన వస్త్రాభరణాలు సమకూర్చాలి.

ఈ ఐదు విధాలుగా సేవించబడ్డ పత్ని **పతితో** ఐదు రకాలుగా సహకరిస్తుంది.

(చ) గృహ నిర్వహణలో సంపూర్ణ కర్తవ్యం వహిస్తుంది.

(ఛ) స్వజనులను - పరజనులను, పనివాళ్ళను బాగా సంతుష్టులుగా ఉంచుతుంది.

(జ) వ్యభిచారిణి కాదు.

(ఝ) పతి సంపాదించిన ఆస్తిని రక్షిస్తుంది.

(ఙ) ఇంటిపనులు సర్వం అలసట లేకుండా చేసుకుపోతుంది.

ఈ ఐదు విధాలుగా పతి ద్వారా సేవించబడ్డ **పశ్చిమదిశ రూపమయిన పత్ని,** పతియందు ఐదు రకాలుగా ప్రీతిజూపించి పశ్చిదిశను శుభకరంగాను, రక్షిత కవచంగాను, సురక్షితంగాను భయరహితంగాను ఉంచుతుంది.

## 4. మిత్రుని యొక్క సేవ.

ఐదువిధాలుగా మిత్రుని సేవించవలెను.

(క) ఇవ్వడంతో,

(ఖ) ప్రియమైన మాటలతో,

(గ) మేలు చేయటంతో,

(ఘ) సమభావం ప్రకటించడముతో,

(ఞ) ఆడినమాట తప్పకుండా విశ్వాసం చూరగొని, అతనిని సేవించవలెను.

పై ఐదు విధాలుగా సేవించబడ్డ **స్నేహితుడు,** కులమిత్రుడైన గృహస్థునికి ఐదు రకాలుగా మేలు చేస్తాడు.

(చ) మత్తులో ఉన్నపుడు అతనిని రక్షిస్తాడు.

(ఛ) మత్తులో ఉన్నపుడు అతని డబ్బును కాపాడుతాడు.

(జ) సంకట సమయంలో శరణునిస్తాడు.

(ఝ) కష్టాలలో తోడు విడవడు.

(ఞ) పరివారంలోని అందరినీ ఆదరిస్తాడు.

ఐదు విధాలుగా సేవించబడ్డ **ఉత్తరదిశ రూపమయిన మిత్రుడు,** బదులుగా ఐదు రకాలుగా సహకరించి ఉత్తరదిశను శుభప్రదముగను, రక్షణ కవచముగను, రక్షణ గను భయవిహీనముగను చేస్తాడు.

## 5. నౌకరుల సేవ.

ఐదు విధాలుగా యజమాని నౌకరుల సేవ చేయవలెను.

(క) వారి శక్తికితగ్గ పని అప్పజెప్పాలి.

(ఖ) వారికి భోజన - వేతనాలివ్వాలి.

(గ) వ్యాధిగ్రస్తుడైన వానిని రక్షించాలి.

(ఘ) ఉత్తమమైన సరసమైన భోజనం పెట్టాలి.

(ఙ) వానికి అవసరమైనపుడు సెలవులివ్వాలి.

ఐదు రకాలుగా సేవించబడ్డ నౌకరులు **యజమానిని** ఐదు విధాలుగా సేవ చేస్తారు.

(చ) యాజమానికంటే ముందే నిద్ర లేస్తారు.

(ఛ) యజమాని నిద్రించిన తరువాత పడుకుంటారు.

(జ) దొంగిలించక, ఇచ్చినది మాత్రమే పుచ్చుకుంటారు.

(ఝ) ఇచ్చిన పనిని చక్కగా నిర్వహిస్తారు.

(ఞ) యజమాని కీర్తి ప్రతిష్ఠలు పెంపొందింప జేస్తారు.

పై ఐదు విధాలుగా సేవించబడ్డ **క్రింది దిశ రూపులైన సేవకులు** యజమానికి ఐదు విధాలుగా సేవచేస్తూ, క్రింది దిశను శుభప్రదముగను, రక్షణ కవచముగనూ, సురక్షితముగానూ, క్షేమ పూర్వకముగానూ భయరహితముగానూ ఉంచెదరు.

## 6. శ్రమణ-బ్రాహ్మణుల సేవ.

1 కులపుత్రుడు ఐదు విధాలుగా శ్రమణ- బ్రాహ్మణుల సేవ చేయవలెను.

(క) మైత్రీ భావం నిండిన శరీరకర్మలతో,

(ఖ) మైత్రీ భావం నిండిన వాచిక కర్మలతో,

(గ) మైత్రీ భావం నిండిన మానసిక కర్మలతో,

(ఘ) విశాలహృదయంతో ఆహ్వానించి,

(ఙ) లోకీయ అవశ్యకతలను పూర్తి చేసి, వారి సేవ చేయవలెను.

పై ఐదు విధాలుగా సేవించబడ్డ శ్రమణ-బ్రాహ్మణుడు, ఆరు విధములుగా కుల పుత్రులపై కృప వహిస్తాడు.

(చ) పాపకర్మల నుండి కాపాడుతాడు.

(ఛ) కుశల కర్మల యందుంచుతాడు.

(జ) కల్యాణకరమగు గాక అని దీవిస్తాడు.

(ఝ) ఇంతకుముందు విని ఉండనటువంటి ధర్మం వినిపిస్తాడు.

(ఞ) శాస్త్రధర్మాలను అన్వేషించి సమృద్ధి పరుస్తాడు.

(ట) సద్గతికి దారి చూపిస్తాడు.

ఈ ఐదు విధాలుగా సేవించబడ్డ **ఊర్ధ్వదశ రూపులైన శ్రమణ బ్రాహ్మణులు,** సద్గృహస్థుని ఆరు విధాలుగా అనుగ్రహించి పై దిశను శుభప్రదముగానూ, రక్షణ కవచముగానూ, సురక్షితముగానూ, క్షేమ పూర్వకముగానూ, భయరహితముగానూ ఉంచెదరు.

సద్గృహస్థుడు ధర్మాచార సంహితను ధారణ చేసి ఈవిధంగా **ఆరుదిశలనుండి భయవిముక్తుడవుతాడు.**

భగవానుని మంగళ ఉపదేశం విన్న శ్రేష్ఠిపుత్ర సిగాలుడు పూర్తిగా తృప్తిచెందాడు. పరంపరాగతంగా వస్తున్న బండబారిపోయిన చచ్చు సాంప్రదాయాలనుండి విముక్తి లభించి సద్ధర్మమైన సజీవమైన వ్యావహారికమార్గాన పయనిస్తూ తన ఇహపర లోకాలను సంస్కరించుకోగలిగాడు.

దీఘనికాయ 3.242. 274 సిఙ్గాలసుత్త

రండి, గృహస్థులారా రండి ! మనంగూడా ఈప్రకారంగా ఈ మంగళకరమైన గృహస్థుల ఆచార-సంహితను ధారణచేసి, మన ఇహలోకము మరియు పరలోకము రెండింటినీ సంస్కరించుకొని నిజమైన మంగళలాభులమవుదాం.

## ఆదర్శ గృహస్థుడు
### హితకారి సత్పురుషుడు

ఒక కులంలో సత్పురుషుడు జన్మించాడంటే అతను చాలామందికి ధనం, హితం మరియు సుఖానికే అయి ఉంటుంది. మాతా పితరులకు ధనం, హితం మరియు

సుఖానికి, స్త్రీలకు, పిల్లలకు ఆస్తి, హితం మరియు సుఖానికి; దాసులు-కర్మచారులకు ధనం, హితం మరియు సుఖానికి; మిత్ర-అమాత్యుల అర్థహితసుఖానికి; గతించిన పూర్వజుల అర్థహితసుఖానికి రాజు యొక్క అర్థహితసుఖానికి; దేవతల అర్థహిత ఇంకా సుఖాలకు; అలాగే శ్రమణ - బ్రాహ్మణుల అర్థహిత సుఖాలకే అయి ఉంటుంది.

## హితసుఖమయ గృహస్థుడు

ఒకానొక సమయాన భగవానుడు కోళియ ప్రదేశంలో కక్కరవత్త నామధేయంగల కోళియ నగరాన విహారం చేస్తున్నారు. అప్పుడు కోళియ పుత్ర దీర్ఘజాణుడు భగవానుని వద్దకు వచ్చాడు. దగ్గరకు వెళ్ళి అభివాదనం చేసి ఒక వైపు కూర్చొని భగవానునికి ఈ విధంగా నివేదించుకొన్నాడు. "భంతే! మేము గృహస్థులం; కామ-భోగులం; పుత్రుల, స్త్రీల బాధలతో సహా ఇంట్లోనివసిస్తూ ఉంటాం; కాశీచందనాన్ని ధరిస్తాం; మాల, గంధ లేపనాలను ధరిస్తాం; వెండి బంగారాలను వాడకంలోకి తెస్తాము, వాటిని ధరిస్తాము. భగవాన్ ! మాకు ఇహ-లోకంలో హితకారి, సుఖకారి మరియు పరలోకంలో గూడా హితకారి, సుఖకారి యగు ధర్మాన్ని ఉపదేశించండి, అని కోరగా...

ఓ వ్యాఘ్రపాదుడా ! **ఉత్థాన-సంపద, ఆరక్ష-సంపద, కల్యాణ-మిత్రత ఇంకా సమజీవితము** అను నాలుగు ధర్మములు, కుల-పుత్రులకు ఇహలోక హితమునకు, ఇహలోక సుఖానికి కారణమవుతాయి.

వ్యాఘ్రపాదా! **ఉత్థాన-సంపద** అని దేన్నంటారు? వ్యాఘ్రపాదా! ఎవరైనా కులపుత్రుడు ఏ ఆజీవిక సాధనైనా ఉపయోగించదలిస్తే, వ్యవసాయంగానివ్వండి, వాణిజ్యం, గోపాలనం, ధనుర్విద్య, రాజకీయ నౌకరి, లేదా ఒక శిల్పకళయైనా - అందులో అతను దక్షుడవుతాడు, సోమరితనాన్ని త్యజిస్తాడు; ఆ పనిని విశ్లేషించడంలో, ఉపయోగించడంలో లగ్నమై ఉంటాడు. దానిని పూర్తి చేయడంలో, క్రమబద్ధము చేయడంలో సమర్థుడవుతాడు. వ్యాఘ్రపాదుడా! **ఇదియే ఉత్థానసంపద అంటే.**

వ్యాఘ్రపాదుడా ! **ఆరక్షా-సంపద** అని దేనినంటారు ? వ్యాఘ్రపాదా! ఒక కులపుత్రుడు వీరుడై కండబలము ఉపయోగించి చెమటోడ్చి ధర్మబద్ధంగా ఐశ్వర్యవంతుడవుతాడు. అతడు తన ఐశ్వర్యాన్ని రాజులు కాజేయకుండా, దొంగలు దొంగిలించకుండా, అగ్నికి ఆహుతికాకుండా, వరదల్లో కొట్టుకు పోకుండా ఇంకా ఏ పనికి మాలినవాడో తన ఐశ్వర్యం పై అధికారం చలాయించకుండా జాగ్రత్త పడతాడు. వ్యాఘ్రపాదా ! **ఇదే ఆరక్షా-సంపద అంటే.**

వ్యాఘ్రపాదా ! **కల్యాణ మిత్రత అనగానేమి** ? వ్యాఘ్రపాదా ! ఏదయినా గ్రామమునందుగానీ, పట్టణమందుగానీ ఎవరయినా కులపుత్రుడుంటే అక్కడ గృహపతి గానీ గృహపుత్రుని వంటి వారు చిన్న వారయినా పెద్దవారయినా కొందరు శీలవృద్ధులై ఉంటారు. వారు శ్రద్ధావంతులు, సదాచారులు, త్యాగులు ప్రజ్ఞావంతులు అయివుంటారు. ఆ గ్రామపు కులపుత్రులు వారితో కాలం గడపడం, మాట్లాడడం, చర్చించడం చేస్తుంటారు. వారివద్ద శ్రద్ధ గురించి నేర్చుకుని శ్రద్ధావంతులవుతారు. శీలాన్ని గురించి నేర్చుకొని శీలవంతులవుతారు, త్యాగం గురించి తెలుసుకొని త్యాగశీలులవుతారు. ప్రజ్ఞ గురించి తెలుసుకొని ప్రజ్ఞావంతులవుతారు. వారితో కలిసి మెలిసి ఉంటూ, మాట్లాడతారు, చర్చిస్తారు. వ్యాఘ్రపాదా ! **వారినే కల్యాణ-మిత్రులంటారు.**

వ్యాఘ్రపాదా ! **సమ-జీవనము అని దేనినంటారు** ? వ్యాఘ్రపాదా ! ఒక కుల పుత్రుడు తను అనుభవిస్తున్న సంపత్తికి ఆదాయం - ఖర్చు తెలుసుకొంటూ దాని ప్రకారం సమ-జీవనం జీవిస్తుంటాడు. మరీ వైభవంగా కాకుండా, మరీ నీచంగా కాకుండా ఖర్చు ఆదాయానికి మించకుండా జీవితం గడుపుతుంటారు. వ్యాఘ్రపాదా, ఇలా తరాజులో తూచినట్లు ఖర్చు ఎక్కడ తగ్గిందో, ఎక్కడ అధికమయిందో స్పష్టంగా తెలుసుకుంటూ ఉంటాడు. ఈ ప్రకారంగా ఒక కులపుత్రుడు తను అనుభవిస్తున్న సంపదను మరీ పైన కాకుండా, మరీ క్రిందకు దిగజారకుండా ఆదాయ-వ్యయాల ననుసరించి ఆదాయం ఖర్చు కంటే అధికంగాకుండా, ఖర్చు ఆదాయానికి మించకుండా సమ-జీవనం గడుపుతుంటాడు. వ్యాఘ్రపాదా! ఒకవేళ ఈ కులపుత్రుడు అల్ప ఆదాయము వాడయివుండి గొప్పవానిలా జీవిస్తున్నట్లయితే అప్పుడు వాని గురించి అందరూ ఈ కులపుత్రుడు మేడిపండు తిన్నట్లు డబ్బు ఖర్చుపెడుతున్నాడని అంటారు. అనగా తినడం కంటె వెదజల్లడమెక్కువ చేస్తుంటాడని అర్థం. వ్యాఘ్రపాదా! ఒక వేళ ఈ కులపుత్రుడు అధిక సంపాదనాపరుడై వుండి గూడా మరీ క్రింది స్థాయిలో పిసినారిగా జీవిస్తుంటే, అందరూ వీడు దిక్కుమాలిన చావు చస్తాడని అనుకొంటూవుంటారు. అనగా తను సంపాదించిన సంపత్తిని దిక్కులేని దానిలా సదుపయోగపరచక అనాథలా వదిలేయడంవల్ల తను గూడా అనాథలాగే పోతాడు అని అర్థం. కానీ వ్యాఘ్రపాదా ! ఎపుడయితే ఒక కులపుత్రుడు తను అనుభవిస్తున్న సంపదను, ఆదాయ-వ్యయాలను దృష్టితో ఉంచుకుని మరీ పైఎత్తులలో కాకుండా మరీ క్రింద కాకుండా "నా ఆదాయం వ్యయం కంటె అధికంగా ఉంటోంది. కానీ నా ఖర్చు ఆదాయానికి మించదు అని సరి సమానమగు జీవనము జీవిస్తువుంటాడో, వ్యాఘ్రపాదా **దీనినే సమ-జీవనము అని అంటారు.**

వ్యాఘ్రపాదా! ఈ ప్రకారంగా ఉత్పన్నమయిన భోగసాధనలు హరించిపోవడానికి నాలుగు దారులున్నాయి. వేశ్యాలోలుడవడం, త్రాగుబోతు కావడం, జూదరి కావడం మరియు దుస్సాంగత్యంలో ఉండడం.

ఒక చెరువులో నీరు నిండడానికి నాలుగుదారులున్నాయనుకుందాం. అలాగే నీరు పోవడానికి కూడా నాల్గుదారులున్నాయనుకుందాం. ఎవరయినా నీరు నిండే దారులు మూసివేసి, నీరుపోయేదారులు తెరిచి ఉంచి, పైనుండి వర్షంగూడా సరిగ్గా కురియకున్నట్లయితే, ఆ చెరువు క్షీణిస్తుందే గానీ వృద్ధి చెందదు. ఇదే విధంగా వ్యాఘ్రపాదా! పైవిధంగా ఉత్పన్నమయిన భోగసాధనల నాశనం గావడానికి నాలుగు దారులు వున్నాయి. 'వేశ్యాలోలత్వం, త్రాగుడు, జూదం, ఇంకా దుస్సాంగత్యం. ఇదే విధంగా ఉత్పన్న భోగసాధనల ఆగమనానికి నాలుగు దారులున్నాయి. వేశ్యాలలోలత్వం లేకుండడం, త్రాగుడుకు దూరముగా ఉండడం, జూదరి కాకుండడం ఇంకా సత్సాంగత్యంతో ఉండడం. ఎలాగైతే పెద్దచెరువులో నీళ్ళు నిండడానికి నాలుగు దారులున్నాయో నీళ్ళు కారి పోవడానికీ నాలుగు దారులున్నాయనుకొందాం.

*(మిగతా అనుబంధ సంచికలో)*

**తెలుగు పత్రిక సంవత్సరపుచందా పూర్తి అయిన సాధకులు రూ. 50 ఈ క్రింది చిరునామాకు పంపి పత్రికను పొందగలరు.**

విపశ్యన తెలుగు మాసపత్రిక,

విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం, నాగార్జున సాగర్ రోడ్, వనస్థలిపురం, హైదరాబాదు - 500 070. ఫోన్ : 24241746 (ఆశ్రమం).

***(ఆఫీసు పనిచేయు వేళలు : ఉదయం 9 గం॥ల నుండి సాయంత్రం 5 గం॥ల వరకు)***

BOOK POST

**PRINTED MATTER**

TO

If Underlivered please return to:

**VIPASSANA INTERNATIONAL MEDITATION CENTRE,**

Nagarjuna Sagar Road, Vanasthalipuram,

HYDERABAD - 500 070.

Published for Vipassana International Meditation Centre, Sahebnagar, Nagarjuna Sagar Road, Vanasthalipuram, Hyd. (A.P) -70. Ph : 040-24240290. Published by Smt. Sabrina Katakam. Editor & Printer : Sri O. Premanand. Printed at Sai Likhita Printers, #6-2-959, Dakshin Bharat Hindi Prachar Sabha Complex, Khairatabad, Hyd. Ph : 23325979. RNI No. APTEL 08618/01/2004-TC

ఎవరయినా నీరు ప్రవహించిపోయే దారులు మూసివేసి నీరు నిండుదారులు తెరచివుంచినట్లయితే, పైపెచ్చు వర్షాలు కూడా బాగా కురిసినట్లయితే ఆ పెద్ద చెరువు బాగా నిండుతుందని ఆశించవచ్చు. ఎండిపోతుందని కాదుకదా! ఇలాగే పైవిధముగా ఉన్నతభోగసాధనల ఆగమనానికి నాలుగు మార్గాలున్నాయి. వేశ్యాలోలుడు కాకుండుట, త్రాగుబోతు కాకుండుట, జూదరి కాకుండుట, మరియు మంచి సాంగత్యముతో ఉండుట. ఈ నాలుగు ధర్మములు కుల పుత్రునికి ఇహలోక హితం మరియు పరలోక సుఖం కలుగజేస్తాయి.

వ్యాఘ్రపాదా ! ఈ క్రింది నాలుగు ధర్మాలు కులపుత్రుని పరలోక హితాన్ని, పరలోకసుఖాన్ని కలుగజేస్తాయి. ఆ నాలుగు ఏవి ? **శ్రద్ధా-సంపద, శీల-సంపద, త్యాగ-సంపద మరియు ప్రజ్ఞా-సంపద.**

వ్యాఘ్రపాదా! **శ్రద్ధాసంపద** అని దేనినంటారు? కులపుత్రుడు, "భగవానుడు అరహంతుడు, సమ్యక్ సంబుద్ధుడు, విద్య మరియు ఆచరణ సంపన్నుడు, సుగతుడు, లోక విదుడు, అనుపమానుడు, (దుష్ట) పురుషులను అణిచివేయు సారథి, దేవతల మానవుల యొక్క శాసకుడు, శిక్షకుడు, బుద్ధుడు భగవానుడు" అను తథాగతుని 'బోధి' పట్ల శ్రద్ధ గలవాడై ఉంటాడు. శ్రద్ధావంతుడై ఉంటాడు వ్యాఘ్రపాదా! దీనినే **శ్రద్ధా-సంపద** అని అంటారు.

వ్యాఘ్రపాదా ! **శీలసంపద** అని దేనినంటారు ? వ్యాఘ్రపాదా ! కులపుత్రుడు ప్రాణ-హింసనుండి, దొంగతనం నుండి, వ్యభిచారం నుండి, మిథ్యాభాషణ మందు ఇంకా మత్తు పానీయాలు మొదలుగా గల ఉన్మత్తులను చేసే మత్తు పదార్ధ సేవనంపట్ల విరక్తి కలిగి ఉంటాడు. వ్యాఘ్రపాదా ! దీనినే **శీలసంపద** అని అంటారు.

వ్యాఘ్రపాదా ! **త్యాగసంపద** అని దేనినంటారు ? వ్యాఘ్రపాదా ! కులపుత్రుడెప్పుడు మద-మాత్సర్యరహిత చిత్తుడై గృహవాసం చేస్తాడో, త్యాగిఅయివుంటాడో, దానశీలుడై, పెద్ద చెయ్యి వాడై, యాచకునికి ఇవ్వడం మరియు పంచి పెట్టేవానిలా ఉండే దానిని **త్యాగ సంపద** అని అంటారు.

వ్యాఘ్రపాదా ! **ప్రజ్ఞాసంపద** అని దేన్నంటారు ? వ్యాఘ్రపాదా ! కులపుత్రుడు ప్రజ్ఞావంతుడై ఉంటాడు. ఉదయవ్యయాల అనుభవము కలుగజేసేది, అవిద్య యొక్క ఆవరణను ఛేదించేది, సమ్యక్ రూపంలో దుఃఖక్షయము చేసేది ఆర్య ప్రజ్ఞ. వ్యాఘ్రపాదా! ఇదే ప్రజ్ఞాసంపద. ఈ క్రింది నాలుగు ధర్మాలూ కులపుత్రుని పరలోక హితానికీ, పరలోక సుఖానికీ కారణమవుతాయి.

***ఉట్ఠాతా కమ్మధేయ్యేసు, అప్పమత్తో విధానవా ।***
***సమం కప్పేతి జీవికం, సమ్భతం అనురక్ఖతి ॥***
***సద్ధో సీలేన సమ్పన్నో, వదఞ్ఞూ వీతమచ్ఛరో ।***
***నిచ్చం మగ్గం విసోధేతి, సోత్థానం సమ్పరాయికం ॥***
***ఇచ్చేతే అట్ఠ ధమ్మా చ, సద్ధస్స ఘరమేసినో ।***
***అక్ఖాతా సచ్చనామేన, ఉభయత్థ సుఖావహా ॥***
***దిట్ఠధమ్మహితత్థాయ, సమ్పరాయ సుఖాయ చ ।***
***ఏవమేతం గహట్ఠానం, చాగో పుఞ్ఞం పవడ్ఢతి ॥***

పని చేయడంలో ఉత్సాహయుక్తుడు, అప్రమాదీ వ్యవస్థాపకుడు, సమతుల్య - జీవనం గడిపేవ్యక్తి, ఆర్జిత సంపదను రక్షించుకొనువాడు, శ్రద్ధగలవాడు, సదాచారి, ప్రజ్ఞావంతుడు మరియు త్యాగి అయివుండి అతడు నిత్యమూ పరలోక మార్గాన్ని పరిశుద్ధంచేసుకుంటాడు. ఈవిధంగా తథాగతుని ద్వారా గృహనివాసులైన శ్రద్ధగల వ్యక్తుల ఇహలోక మరియు పరలోక సుఖానికై ఎనిమిది మార్గములు తెలియజేయడం జరిగింది. ఈ ప్రకారముగా గృహస్థుల త్యాగము వారి పుణ్యవృద్ధికి కారణమవుతుంది.

అఙ్గుత్తరనికాయ 3.8.54.55
దీఘజాణుసుత్తము.

## సుఖమయ గృహస్థుడు

ఒకసారి అనాథపిండక గృహపతి భగవానుని దగ్గరకువచ్చి ప్రణామము చేసి ఒకవైపు కూర్చొన్నాడు. అప్పుడు అనాథ పిండక గృహస్థునితో భగవానుడు ఇలా చెప్పాడు. **"గృహపతీ ! ఈ నాలుగు సుఖములు** కామ భోగులయిన గృహస్థులకు అప్పుడప్పుడు ప్రాప్తిస్తుంటాయి. ఆ నాలుగు ఏవనగా భోగ్యపదార్థములు కలిగియుండు సుఖము, వాటిని భోగించు సుఖము, ఋణములేని సుఖము మరియు నిర్దోషుడుగా ఉండే సుఖము.

గృహపతీ ! **భోగ్యపదార్థముల కలిగివుండు సుఖం ఎలాంటి సుఖం?** ఎవరైనా కులపుత్రుని ఇంట్లోని వస్తువులు స్వయంకృషితో, బాహుబలంతో, చెమటోడ్చి ధర్మానుసారంగా సంపాదించాలి. అప్పుడే సుఖముంటుంది. తను అనుభవిస్తున్న పదార్థాలు స్వప్రయత్నంతో, స్వయంకృషితో బాహుబలంతో, చెమటోడ్చి ధర్మబద్ధంగా సంపాదించాననే ఆనందం ఉంటుంది. గృహపతీ ! ఇవి భోగ్యపదార్థాలు కలిగివున్న సుఖం అనబడుతుంది.

గృహపతీ ! **భోగ్య - పదార్థాలను అనుభవించే సుఖమని దేనినంటారు?** గృహపతీ! ఒక కులపుత్రుడు పట్టుదలతో ప్రయత్నపూర్వకంగా బాహుబలంతో చెమటోడ్చి ధర్మబద్ధంగా సంపాదించిన దానితో పుణ్యకర్మలు చేయాలి. ఎప్పుడైతే అతను పట్టుదలతో ప్రయత్నపూర్వకంగా బాహుబలంతో, చెమటోడ్చి ధర్మానుసారంగా సంపాదించిన పదార్థాలను అనుభవిస్తూ వాటితో పుణ్యకార్యాలు చేస్తాడో అప్పుడు వానికి దీని వల్ల సుఖం ప్రాప్తిస్తుంది. దానితో ఆనందం కలుగుతుంది, గృహపతీ ! ఇదే భోగ్య-పదార్థాలను అనుభవించే సుఖమంటే !

గృహపతీ! **ఋణం లేని సుఖం అనగా నేమి ?**

గృహపతీ ! ఒక కులపుత్రుడు ఎక్కువో తక్కువో ఎవరికీ ఏమీ ఇవ్వవలసిందిలేనపుడు, "నేను ఎవరికీ కొంచెం గానీ లేక ఎక్కువ గానీ ఇవ్వవలసింది లేదు" అని తలచుకొని సుఖంగా ఉంటాడు. ఆనందం అనుభవిస్తాడు. గృహపతీ, ఋణంలేని సుఖమంటే ఇదే.

గృహపతీ! **నిర్దోషుడుగావుండే సుఖం అనగానేమి ?**

గృహపతీ, నిర్దోషియైన కులపుత్రుడు కాయక కర్మలలో నియుక్తుడై ఉంటాడు. నిర్దోషమైన వాచిక కర్మలో నియుక్తుడై ఉంటాడు. మానసిక కర్మలో నిర్దోషుడై ఉంటాడు. అతను, "నేను కాయక కర్మచే నిర్దోషిని, వాచిక కర్మలో నిర్దోషిని, మానసిక కర్మలో నిర్దోషిని" అని తలచుకొని సుఖంగా ఉంటాడు. ఆనందంగా ఉంటాడు. గృహపతీ ! ఇదే నిర్దోషుడుగా ఉండే సుఖమంటే.

ఈ నాలుగుసుఖాలూ కామ-భోగులయిన గృహస్థులకు అప్పుడప్పుడు ప్రాప్తిస్తుంటాయి.

- అఙ్గుత్తరనికాయ 1.4.62 ఆనణ్యసుత్తము.

## వివాహ ధర్మ-విధి

మనం అధర్మానుసారంగా గాక ధర్మానుసారంగా భార్య కోసం వెతకాలి. ఈ విషయంలో ధర్మ-విధి ఏమిటి? క్రయ - విక్రయాలద్వారా ఆమెను పొందగూడదు. ఆమెను కేవలం ఆమె తల్లితండ్రులు అతని చేతిలో నీరు పోసి అతనికి ఇవ్వాలి.

### నాలుగు రకాల సహవాసము

గృహపతులారా ! భార్యా భర్తలు నాలుగు రకాలుగా కలిసి ఉంటారు. ఆ నాలుగు రకాలు ఏవంటే.....

1. శవము, శవముతో కలిసి ఉండటం.
2. శవము దేవితో కలిసి ఉండటం.
3. దేవుడు శవముతో కలిసి ఉండటం.
4. దేవుడు దేవితో కలిసి ఉండటం.

1. గృహపతులారా ! శవము శవముతో ఎలా కలిసి ఉంటుంది ? గృహపతులారా ఇక్కడ స్వామి (పతి) హింసావాది, దొంగ, దురాచారి, అబద్ధాలాడువాడు, త్రాగుబోతు, దుశ్శీలుడు, పాపి, పిసినారి, మలినచిత్తుడు, శ్రమణ-బ్రాహ్మణులను దుర్వచనములతో దూషించువాడయి గృహంలో నివసిస్తుంటాడు. అతని భార్య గూడా హింసావాది, దొంగ, దురాచారిణి, అబద్ధమాడునది, త్రాగుబోతు, దుశ్శీలి, పాపి, పిసినారితనంతో మలినచిత్తురాలు, శ్రమణ-బ్రాహ్మణులను దుర్వచనాలతో దూషించునది అయి గృహములో నివసిస్తుంటుంది. అప్పుడు గృహస్థులారా ! శవము శవముతో సహవాసం చేస్తుంది అని అనాలి.
2. గృహపతులారా ! శవము దేవితో ఎలా కలిసి ఉంటుంది?
గృహపతులారా ! స్వామి హింసావాది, దొంగ, దురాచారి, అబద్ధమాడువాడు, త్రాగుబోతు, దుశ్శీలుడు, పాపి, పిసినారితనమను మలినచిత్తుడు, శ్రమణ-బ్రాహ్మణులను దుర్వచనాలాడుతూ గృహమునందు సహవాసముంటాడు. అతని భార్య అహింసావాది, దొంగతనమంటే విరక్తి, సదాచారిణి, సత్యవంతురాలు, త్రాగుడుపై విరక్తి కల్గినది, సుశీలవతి, కల్యాణ ధర్మయుక్తమయినది, మద మాత్సర్యరహితురాలు, శ్రమణ-బ్రాహ్మణులను

దుర్వచనము లాడనిదై గృహమునందు నివసిస్తుంది. అప్పుడు గృహపతులారా? శవము దేవితో కలిసి ఉంటుంది అనాలి.

3. గృహపతులారా ! దేవుడు శవముతో ఎలా కలిసి ఉంటాడు ?
గృహపతులారా ! స్వామి అహింసావాది, దొంగతనమన్న విరక్తి, సుశీలుడు, చక్కని ధర్మపరాయణుడు, యుక్తుడు, మద-మాత్సర్యరహితుడు, శ్రమణ-బ్రాహ్మణులను దుర్వచనాలాడనివాడు గృహములో నివసిస్తుంటాడు. అతని భార్య హింసావాది, దొంగ, దురాచారిణి అబద్ధమాడునది, త్రాగు బోతు, దుశ్శీలి, పాపి, పిసినారితనం అను మలినంతోనిండిన మనసుగలది, శ్రమణ-బ్రాహ్మణులను దుర్వచనాలతో దూషించునదై గృహంలో నివసిస్తుంది. అప్పుడు గృహపతులారా! దేవుడు శవముతో కలిసి ఉంటుంది అనాలి.

4. గృహపతులారా ! దేవుడు దేవితో ఎలా కలిసి ఉంటాడు ?
గృహపతులారా ! స్వామి అహింసావాది, దొంగతనంపట్ల విరక్తి, సదాచారి, సత్యవంతుడు, త్రాగుడన్న విరక్తి, సుశీలుడు, చక్కని ధర్మపరుడు, మద-మాత్సర్య రహితుడు, శ్రమణ-బ్రాహ్మణులను దుర్వచనాలాడనివాడుగా గృహంలో నివసిస్తుంటాడు. అలాగే అతనిభార్యగూడా అహింసావాది, దొంగతనంపట్ల విరక్తి, సదాచారిణి, సత్యవంతురాలు, త్రాగుడన్న విరక్తి, సుశీలవతి, చక్కని ధర్మపరురాలు, మద-మాత్సర్యరహితురాలు, శ్రమణ-బ్రాహ్మణులను దుర్వచనాలతో దూషించనిది అయివుండి, గృహమునందు నివసిస్తుంది. అప్పుడు దేవుడు దేవితో కలిసి ఉంటున్నాడనవలెను.

గృహపతులారా! నాలుగు సహవాసములు ఇవే .

అఙ్గుత్తరనికాయ 1.4.53-54, పటమసంవాససుత్తము.

## మంగళ ముహూర్తం

సదాచారంతో పరిపూర్ణమైన సమయమే గృహస్థునకు మంగళముహూర్తం.

**పూర్వాహ్ణం :** ఎవరు తమ పూర్వాహ్న సమయమున (భోజనమునకు ముందు) తన కాయము, వాణి, చిత్తములతో సదాచారపాలనచేస్తారో, వారికి ఇదే పూర్వాహ్న కాలీన మంగళముహూర్తం.

**మధ్యాహ్నం :** ఎవరు మధ్యాహ్నసమయాన తమ కాయము, వాణి చిత్తములతో సదాచారపాలనచేస్తారో అదేవారికి మధ్యాహ్న కాలీన మంగళముహూర్తం.

**అపరాహ్ణం :** ఎవరు అపరాహ్ణ వేళ (భోజనం తరువాతి పగలు మూడవజాము) తన కాయము, వాణి, చిత్తములతో సదాచారపాలనంచేస్తారో, అదే వారికి మంగళ ముహూర్తం.

- అఙ్గుత్తరనికాయ 1.3.156 పుబ్బణ్హసుత్తము.

## ఐదు వర్జిత వ్యాపారాలు

గృహస్థులు ఈ ఐదు రకాల వృత్తి వ్యాపారాలపట్ల విరక్తులై ఉండవలెను.

1. ఆయుధ వ్యాపారం.
2. పశు-పక్షుల (ప్రాణుల) తో వ్యాపారం.
3. మాంసపు వ్యాపారం.
4. మదిర మొదలగు మత్తుమందుల వ్యాపారం.
5. విషముల వ్యాపారం.

- అఙ్గుత్తరనికాయ 2.5.177, వణిజ్జాసుత్తము.

## హిత సుఖకారి దుర్లభ పంచరత్నాలు

లోకములో ఈ ఐదు రత్నాలు అనుభవగతమగుట దుర్లభము.

1. లోకములో తథాగతుడు, అరహంతుడు, సమ్యక్ సంబుద్ధుడు జనించుట దుర్లభం.
2. లోకములో శుద్ధధర్మాన్ని బోధించ ఉపదేశకుడు జనించుట దుర్లభము.
3. లోకములో శుద్ధధర్మాన్ని గురించిన ఉపదేశాన్ని విని, దాన్ని అర్థం చేసుకొనేవాడు పుట్టడం దుర్లభము.
4. లోకములో శుద్ధధర్మంయొక్క ఉపదేశాన్నివిని అర్థం చేసుకొన్నవి, తదనుకూలంగా ఆచరించేవాడు పుట్టడం దుర్లభము.
5. లోకములో కృతజ్ఞుడు మరియు ప్రతిఫలం ఆశించక పరోపకారం చేయువాడు పుట్టడం దుర్లభము.

- అఙ్గుత్తరనికాయ 2.5.143.195 సారన్దదసుత్త, పిజ్ఞియానీసుత్తము.

## ధర్మం రక్షిస్తుంది

ధర్మాన్ని ఆచరించు వ్యక్తిని ధర్మం రక్షిస్తుంది. ధర్మపాలనం సుఖాన్నిస్తుంది. ధర్మపాలనంచేసే వ్యక్తిని దుర్గతి పాలవకుండాచూసే గుణం ధర్మాని కుంది. వర్షాకాలంలో పెద్దగొడుగు రక్షణనెలా ఇస్తుందో, ధర్మాన్ని ఆచరించే వ్యక్తికి ధర్మం అలా రక్షణనిస్తుంది.

- జాతక 1.10.103, మహాధమ్మపాలక జాతక (447)

## నీ కర్మల వలననే సద్గతి దుర్గతులు గానీ ప్రార్థనల వలన కాదు

ఒక సమయాన భగవానుడు నాలందాలో విహరిస్తూ ఉన్నాడు. అసిబంధక గ్రామణీ అనువాడు భగవానుని వద్దకు వచ్చి - "భంతే! భగవాన్ ! బ్రాహ్మణులు చనిపోయినవారిని పిలిచి వారిని స్వర్గానికి పంపుతారు. భంతే ! భగవానుడు అరహంతుడు. సమ్యక్ సంబుద్ధుడు. మీరు లోకులందరినీ మరణానంతరం స్వర్గంలో పుట్టించి సుగతికి ప్రాప్తులయ్యేలా చేయవచ్చుకదా!

గ్రామణీ ! నేను నిన్నే అడుగుతాను. నీకు తోచినట్లు జవాబు చెప్పు. నీవు ఏమనుకుంటావో చెప్పు. ఎవరయినా జీవహింస చేసేవాడు, దొంగతనం చేసేవాడు, వ్యభిచారం చేసేవాడు, అబద్ధాలాడేవాడు, చాడీలు చెప్పేవాడు, కఠోరంగా మాట్లాడేవాడు, సొల్లు కబుర్లు చెప్పేవాడు, లోభి, నీచుడు, మిథ్యాభావాలు కలవాడిని అందరూ వచ్చి అతనిని పొగుడుతూ చేతులు జోడించి, 'మీరు చనిపోయిన తరువాత స్వర్గం చేరతారు. ఊర్ధ్వగతి ప్రాప్తిస్తుంది', అని నివేదించినప్పుడు, 'గ్రామణీ నీవేమనుకొంటావు ? అతను మరణించిన తరువాత ఊర్ధ్వలోకాలకుపోయి స్వర్గంలో పుడతాడంటావా?'

లేదు, భంతే లేదు !

గ్రామణీ ! ఎవరయినా పురుషుడు లోతైన జలాశయంలో ఒక పెద్దరాయి వదలితే అక్కడ అందరూచేరి దానిని ప్రశంశిస్తూ చేతులు జోడించి, 'రాయీ... ఓ రాయీ.. పైకిరా, పైకిరా. నీటి పైకిరా', అని ప్రార్థిస్తే గ్రామణీ ఆ రాయి నీటిపై తేలుతుందా? నీవేమనుకొంటావు ?

లేదు, భంతే లేదు !

గ్రామణీ ! అలాంటి ఒక పురుషుడు, జీవహింస చేసేవాడు; అతన్ని చాలా మంది వచ్చి ప్రార్థించినా, వాడు చనిపోయిన తరువాత దుర్గతిపాలయి నరకానికే పోతాడు. ఎవరైనా నేతితో గానీ, నూనెతో గాని నిండిన కుండను జలాశయంలో ముంచి పగులగొడితే దాంట్లో రాళ్ళు రప్పలు ఉన్నట్లయితే అవి క్రిందకు మునిగిపోయి, నూనె-నెయ్యి పైకి తేలినపుడు, చాలామంది కలిసి, "ఓ నెయ్యి! ఓ నూనా! నువ్వు మునిగిపోవాలి. క్రిందకి పోవాలి; రాళ్లూ-రప్పలూ, మీరు పైకి తేలండి," అని ప్రార్థిస్తే అది సంభవం కాదుగదా! కాబట్టి గ్రామణీ ! తమ తమ కర్మలనుబట్టే సుగతిగానీ - దుర్గతి గానీ లభిస్తుంది. ప్రార్థనలవల్లకాదు.

- సంయుత్తనికాయ 2.4.358, అసిబంధకపుత్తసుత్తము.

## అంధ విశ్వాస త్యాగం

కాలాములారా ! ఏ విషయాన్ని గురించయినా విన్నది నమ్మకండి. అది పరంపర నుండిగాని, ప్రసిద్ధిగాంచినదనిగాని, గ్రంథాలలో ఉందనిగాని, తర్కంవల్ల ప్రాప్తించిందనిగాని, న్యాయమనిపించిందనిగాని, సుందరంగా ఉందనిగాని, ఇష్టమైనదనిగాని, సమర్థమైనదనిగాని ఇంకా మన శ్రమణుడు (గురువు) వచించినదనిగాని స్వీకరించకండి.

కాలాములారా ! ఒక విషయం అకుశలమైనదని, దోషమైనదని, విజ్ఞులు నిందింతురని, దీనిని సందేహించకుండా స్వీకరించడం వల్ల అహితం మరియు దుఃఖం కలుగుతుందని ఎప్పుడైతే మీరు స్వయంగా తెలుసుకొంటారో, ఓ కాలామో! మీరు దాన్ని వదిలివేయండి.

కాలాములారా ! ఒక విషయం కుశలమైనదని, దోషరహితమైనదని, విజ్ఞులు ప్రశంశించునదని, దీనిని నిస్సందేహంగా స్వీకరించడంవల్ల సుఖం మరియు హితం కలుగుతుందని ఎప్పుడైతే మీరు స్వయంగా తెలుసుకొంటారో, అప్పుడు కాలామా ! దీనిని స్వీకరించి విహరించండి. భిక్షువులారా ! నా మాటలు గూడా నేను చెబుతున్నానని మీరు గ్రహించకండి. జాగ్రత్తగా పరీక్షించిన తరువాతే గ్రహించండి.

- అఙ్గుత్తరనికాయ 1.3.66 కేసముత్తిసుత్తము.

*(సశేషం)*